



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాధికా గుప్తా

ఐలమ్మ సేవలు మరువలేనివి

» అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివని, ఆమె గొప్పతనాన్ని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా కొనియాడారు. ఆమె వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కాంతమ్మ, సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్, పాల్గొన్నారు.

వికారాబాద్ కలెక్టరేట్‌లో ఘన నివాళి




నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు

వికారాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ జీవితం ఒక చరిత్ర అని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్వో మంగ్లీలాల్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విధుల్లోకి జీపీవోలు

మేడ్చల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో నేటి నుంచి గ్రామ పాలనాధికారులు(జీపీవో) విధుల్లో చేరనున్నారు. జిల్లాలో 47 మంది జీపీవోలు నేటి నుంచి విధులు చేపట్టనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీఆర్ఓ వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్వోల స్థానంలో గ్రామ పాలనాధికారుల(జీపీవో) సేవలను తిరిగి అందుబాటులోకి తీసుకొస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే జిల్లాలో వీఆర్వోలకు రెండు దఫాలుగా రాత పరీక్షలను నిర్వహించారు. జిల్లాలోని 55 మంది అర్హులైన వారు పరీక్షకు హాజరయ్యారు. అందులో 47 మంది ఎంపికగా వారు నేడు విధుల్లో చేరనున్నారు.

ఆమే కీలకం!



పురుషుల కంటే 11,020 మంది మహిళా ఓటర్లు అధికం
17 మండలాల్లో వారిదే పైచేయి
జిల్లాలో మొత్తం 1,289 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు
డ్రాఫ్ట్‌పై 11 అభ్యంతరాలు.. పరిష్కారం

ప్రాదేశిక ఎన్నికల ఓటరు తుది జాబితా ఖరారు

జిల్లా, మండల ప్రాదేశిక(ఎంపీటీసీ) నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలను ఖరారు చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీల వారీగా తుది జాబితాలను బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంతో పాటు అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రచురించారు. ఈనెల 6న ముసాయిదాలను జిల్లా ఎన్నికల అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. 8వ తేదీ వరకు వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి బుధవారం తుది ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించారు. జిల్లాలో పురుషుల కంటే 11,020 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండడం గమనార్హం.



జెడ్పీ కార్యాలయంలో తుది జాబితాను ప్రదర్శిస్తున్న అదనపు జిల్లా ఎన్నికల అధికారి సుధీర్

వికారాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈనెల 2వ తేదీన ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 1,288 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అదనంగా తాండూరు మండలంలో మరొక కేంద్రం ఏర్పాటు చేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 6,98,472 మంది గ్రామీణ ఓటర్లు ఉండగా, వారిలో 3,43,668 మంది పురుషులు, 3,54,788 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 20 మండలాల పరిధిలో 20 జెడ్పీటీసీ, 227 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. తుది ఓటర్లు, పోలింగ్

మిగతా 8వ పేజీలో...

మండలాలు	20
జెడ్పీటీసీలు	20
ఎంపీటీసీలు	227
పోలింగ్ కేంద్రాలు	1,289

అతివలదే ఆధిక్యం ...

జిల్లాలో గ్రామీణ ఓటర్లలో మహిళలు ఎక్కువగా ఉన్నారు. గ్రామీణ ఓటర్లు మొత్తం 6,98,472 మంది ఉండగా, వారిలో 3,43,718 మంది పురుషులు, 3,54,738 మంది మహిళలు ఉన్నారు. పురుషుల కంటే 11,020 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండడం గమనార్హం. బషీరాబాద్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కొడంగల్, పెద్దేముల్, తాండూరు, యాలాల్, బంట్వారం, ధారూరు, దోమ, కోట్‌పల్లి, కులకచర్ల, మోమిన్‌పేట్, పరిగి, పూడూరు, వికారాబాద్, దుద్యాల్ మండలాల్లో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు.

ఓటర్ల వివరాలు		
	పురుషులు	మహిళలు
	3,43,718	3,54,738
	ఇతర ఓటర్లు	మొత్తం
	16	6,98,472



రైల్వే డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సంద్ర రమేశ్‌బాబు

ఘట్‌కేసర్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడు సంద్ర రమేశ్‌బాబు బుధవారం దక్షిణ మధ్య రైల్వే డీజీఎం ఉదయ్‌నాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలు శరవేగంగా అభివృద్ధి చెందుతుండటం వలన రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ ప్రాంత ప్రజలు రైల్‌లో దూర ప్రాంతాలకు వెళ్లడానికి అటు సికింద్రాబాద్, లేదా ఇటు వరంగల్‌కు వెళ్లాల్సి వస్తున్నదని తెలిపారు. ఘట్‌కేసర్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపడం వలన ప్రధానంగా విద్యార్థులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

'వికారాబాద్'లో 2 వేల వీధికుక్కలు



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

వికారాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలో 2 వేల వీధి కుక్కలను గుర్తించినట్లు మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. బుధవారం పట్టణంలో వీధి కుక్కలను పట్టుకుని జనన నియంత్రణ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 485 వీధి కుక్కలను పట్టుకోవడం జరిగిందని, అందులో 452 కుక్కలకు జనన నియంత్రణ సర్జరీ చేయించినట్లు తెలిపారు.

బషీరాబాద్‌లో భారీ వర్షం

» అలుగుపారిన నవాల్గ నల్లచెరువు
» కోట్‌పల్లి, ధారూర్‌లోనూ మోస్తరు వాన



కల్వర్టుపై వరద.. వాహనదారుల ఇక్కట్లు



నవాల్గ నల్ల చెరువు అలుగు పారడంతో కల్వర్టుపై ప్రవహిస్తున్న వరద

బషీరాబాద్/కోట్‌పల్లి/ధారూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ప్రధానంగా బషీరాబాద్, కోట్‌పల్లి, ధారూరు మండలాల్లో వాన పడింది. బషీరాబాద్ మండలంలో కురిసిన భారీ వర్షానికి నవాల్గ గ్రామంలోని నల్లచెరువు రెండు వైపుల అలుగు పారింది. దీంతో లో-లెవల్ కల్వర్టుల మీదుగా నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో వాహనదారులు కల్వర్టు పైనుంచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్ గ్రామంతో పాటు మోత్కుపల్లి, ఎన్కెపల్లి. తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నీరు వరదాల పారింది. అలాగే ధారూరు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. వారం రోజులుగా వాతావరణం పొడిగా ఉండి ఎండ కాసింది. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.

కీసరగుట్ట హుండీ ఆదాయం రూ.24 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కీసర, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 24,36,134 వచ్చినట్లు ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ మహా మండపంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆరు నెలల హుండీ సొమ్ము, అన్నదానం హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా రూ. 23,67,789 హుండీ ద్వారా రూ.68,345 అన్నదానానికి మొత్తం రూ.24,36,134 వచ్చినట్లు వివరించారు. వచ్చిన ఆదాయ్నాన కీసర ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండర్ సభ్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు సామల అమరేందర్, సగ్గు అనిత ప్రభాకర్ గౌడ్, జూపల్లి సాయిలు, రెడ్డబోయిన ప్రవీణ్, కందాడి రాజిరెడ్డి, మొరుగు ముత్యాలు, ప్రధాన అర్చకుడు బలరాం శర్మ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతులు

తక్షణమే రుణమాఫీ చేయాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండల రైతులకు తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎదులాబాద్ రోడ్డుపై రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఘట్‌కేసర్‌లోని సహకార సంఘం పరిధిలో 1,190 మంది రైతులు రుణాలు తీసుకున్నారని గుర్తు చేశారు. కానీ ఏ ఒక్కరికి రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.8కోట్ల 11లక్షల బకాయిలు మాఫీ కావాల్సి ఉన్నదని గుర్తు చేశారు. సహకార బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికే అధికారులతోపాటు, ఎమ్మెల్యే, ఎంపీకి వినతిపత్రాలు అందజేసినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అదును దాటుతున్నా అందని యూరియా!

నెలరోజులుగా తీరని వ్యథ

దిగుబడిపై రైతుల్లో పెరుగుతున్న దిగులు
వేకువజాము నుంచే దుకాణాలకు క్యూ
కృత్రిమ కొరతకు తోడు పక్కదారి
రసాయన ఎరువులు కొంటేనే యూరియా
అవసరం లేకపోయినా తప్పని కొనుగోలు
పట్టించుకోని సంబంధిత అధికారులు



పరిగి అగ్రోస్ కేంద్రం వద్ద రైతుల బారులు

పరిగి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సుమారు నెల రోజులు దాటుతున్నా జిల్లాలో యూరియా తిప్పలు తప్పడం లేదు. అదును దాటి దిగుబడి వస్తుందో రాదో అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. కృత్రిమ కొరతకు తోడు, జిల్లాకు సరిపడా నత్రజని రాకపోవడం సమస్యగా మారుతోంది. అయినా తెల్లవారే సరికి ఎరువుల దుకాణాల ముందు రైతులు క్యూ కడుతున్నారు. గత పదిహేను రోజులుగా దుకాణాలకు యూరియా కోసం వెళ్తున్న రైతులు యూరియా నిల్వలు లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. పలుచోట్ల రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.




పరిగిలో ఇటీవల వర్షాలకు ఏపుగా పెరిగిన పత్తి పంట

ఇతర ఎరువులతో సరిపెడుతూ

అదునుదాటుతున్నా పంటలకు యూరియా వేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు రైతులు యూరియా వేయకుండానే వరి నాట్లు వేస్తున్న పరిస్థితి. మరికొంత మంది ప్రత్యామ్నాయంగా ఇతర ఎరువులను వినియోగిస్తున్నారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా ఆచరణలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. వర్షాధారిత పంటల్లో యూరియా వేయడానికి ఇదే మంచి సమయం కావడంతో యూరియా వినియోగం బాగా

మిగతా 8వ పేజీలో...



యూరియా కోసం ఇతర మందులు కొన్న

యూరియా కోసం దుకాణానికి వెళ్తే ఏదైనా ఇతర మందులకు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని షరతు విధిస్తున్నారు. ఎందుని ప్రశ్నిస్తే పైనుంచే కొరత ఉంది, తామేమి చేస్తామని సమధానం ఇస్తున్నారు. నేను ఇరవై ఎకరాలు సాగు చేస్తా. ఒకటి, రెండు బస్తాలు ఇస్తామంటే ఏం చేయాలి. తప్పక అవసరం లేకపోయినా రసాయన మందులు కొని యూరియా తీసుకున్నా. అది కూడా బస్తా రూ.300లకు పైగా విక్రయిస్తున్నారు.

-టి.శశాంక్‌రెడ్డి, రైతు,సుల్తాన్‌పూర్, పరిగి మండలం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నాణ్యమైన భోజనం అందించాలి

» ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కోట్‌పల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి పీహెచ్‌సీ, జెడ్పీహెచ్ఎస్, అంగన్వాడీ, రేషన్ దుకాణాలను ఆహారభద్రత సలహాసంఘం సభ్యులు భారతి, శారద, ఆనంద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల, విద్యార్థుల సమస్యలను తెలిపేందుకు పాఠశాల, చౌకధరల దుకాణాల ఆవరణలో అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన ఫిర్యాదు పట్టికను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీల్లో పిల్లలు, గర్భిణులకుపోషకాహారాన్ని అందించాలన్నారు. ఎప్పటికప్పుడు రేషన్ నిల్వలను రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేసిన వివరాలను పరిశీలించిన కమిషన్ సభ్యులు సిబ్బందిని ప్రశంసించారు. కాగా, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల కోట్‌పల్లిలో మధ్యాహ్న భోజనం మాడి పోవడం, కూరగాయలకు బదులుగా సాంబార్‌లో కూరగాయలు కలిపి పెట్టడం, మెనూ ప్రకారం లేదని ఉపాధ్యాయులకు సూచించి తీరు మార్చుకోవాలన్నారు. ఈ పర్యటనలో డీఆర్డీఏ శ్రీనివాస్, డీఈవో రేణుకాదేవి, డీఎంహెచ్ఓ లలితాదేవి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, ఫుడ్ సెక్యూరిటీ అధికారి జగన్నాథ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో డానియల్, డాక్టర్ మేఘన పాల్గొన్నారు.

కవి చంద్రశేఖర్‌కు కీర్తి పురస్కారం



తాండూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారానికి(వచన కవితల విభాగం) తాండూరుకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి కవి కోటం చంద్రశేఖర్ ఎంపికయ్యారు. తెలుగు యూనివర్సిటీ ఈ నెల 23న తేదీన చంద్రశేఖర్‌కు నగదు, పురస్కారాన్ని ప్రదానం చేస్తుందని వర్సిటీ రిజిస్ట్రార్ కోట్ల హన్మంతరావు బుధవారం పేర్కొన్నారు





ముదిరాజ్‌ల సంక్షేమానికి సర్కారు కృషి


రంగాపూర్‌లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముదిరాజ్‌ల హక్కులు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ ముదిరాజ్ భవన నిర్మాణానికి రంగాపూర్‌లో ఎకరం స్థలాన్ని కేటాయించారు. బుధవారం సంఘం నాయకులకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్‌ను అందజేసి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు ఎమ్మెల్యేను సన్మానించారు. రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సంఘ భవన నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేయిస్తానని తెలిపారు. దీన్ని రాష్ట్రంలోని మోడల్‌గా నిర్మించుకుందామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.హన్మంత్, క్రిష్ణగిరిక్షేత్రం పీఠాధిపతి కృష్ణస్వామి, టి.రామస్వామి, శ్రీశైలం, పరశురాంరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.జగన్మోహన్ పాల్గొన్నారు.

యాదవ సంఘానికి స్థలం కేటాయించాలి

పరిగి నియోజకవర్గ యాదవ సంఘానికి స్థలాన్ని కేటాయించడంతోపాటు, భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని అఖిలభారత యాదవమహాసభ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. భూమి, నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డీసీసీ ప్రధానకార్యదర్శి డాక్టర్ రాంచంద్రయ్య, సంఘంజిల్లా అధ్యక్షుడు యాదయ్య, రాముయాదవ్, మల్లేశ్, విశ్వనాథ్, నర్సింహులు, రమేశ్, సాయిబాబ, శ్రీశైలం, బాస్కర్, మల్లేశ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తాం

కులకచర్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కులకచర్ల రైతు వేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దసరాకు డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, రామకృష్ణ, మనోహరచక్రవర్తి, షైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


కడా అధికారికి వినతిపత్రం ఇస్తున్న గాంధీనగర్ వాసులు

రోడ్డు నిర్వాసితులకు న్యాయం చేయాలి

కొడంగల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని గాంధీనగర్ వాసులు కోరారు. బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. కాలనీలోని 75మంది ఇళ్లు కోల్పోయారని, వారికి పరిహారంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుస్స చంద్రయ్య, రమేశ్‌బాబు, మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, జగన్‌మోహన్, మొగులప్ప, శ్రీనివాస్, నియాజ్, జాహిద్, శ్రీనివాస్, ఎల్లమ్మ, లక్ష్మణ్, పకీరప్ప, వెంకటమ్మ, సాయిలు పాల్గొన్నారు.

రాంనగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారం

కులకచర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంగనర్‌లో కొన్ని రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ నీరు రావడం లేదని గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి బుధవారం బోరు వేయించి మోటార్ బిగించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తహసీల్దార్ కార్యాలయ అధికారులపై ఫిర్యాదు

ధారూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ధారూరు తహసీల్దార్ కార్యాలయ అధికారులు రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని దోర్నాలకు చెందిన మహిపాల్ బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పైసలు ఇవ్వనిదే పనులు చేయడం లేదని అన్నారు. భూభారతి సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు కొర్రీలు పెడుతూ రైతుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని తెలిపారు. దళారులు పైరవీలు చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. అధికారుల తీరుపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో పెంచుకునే కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తప్పక వేయించాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డి చెప్పారు. బుధవారం పట్టణంలోని కేఎల్లార్ వెంచర్లో బ్లూ క్రాస్ సొసైటీ సౌజన్యంతో చేపట్టిన యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరు పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు.

టీఎస్‌జీఆర్‌ఈఏ మండల యూనిట్ల ఎన్నికలు

వికారాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం(టీఎస్‌జీఆర్‌ఈఏ) మండల యూనిట్లకు ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నర్సింహారెడ్డి బుధవారం తెలిపారు. 11న తాండూరు, పరిగి మండలాలు, 13న వికారాబాద్, కొడంగల్, 17న మోమిన్‌పేట్, బషీరాబాద్, 19న యాలాల్, మర్పల్లి, 21న కులకచర్ల మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కొడంగల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ దీపక్ శ్యామ్సన్ అన్నారు. బుధవారం కొడంగల్‌లోని బాలుర పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వంట గది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. సమస్యలపై విద్యార్థులతో మాట్లాడారు. భోజనం ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో ఆర్ఐ రాఘవేందర్, సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మోమిన్‌పేట్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ సదాశివుడు అన్నారు. మంగళవారం రాత్రి మోమిన్‌పేట్‌లో అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ సహకారంతో ఎస్సీ కాలనీలో అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమే అన్నారు. గంజాయి లేదా మత్తుపదార్థాల రవాణా, విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



భూదాన్ భూముల గుర్తింపు..

తాటిపర్తి గ్రామస్తుల హర్షం


తాటిపర్తిలోని భూదాన్‌భూమి

యాచారం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని తాటిపర్తిలోని సర్వే నెంబర్ 104లో గల భూములను భూదాన్‌భూమిగా రెవెన్యూ అధికారులు గుర్తించి మాకు న్యాయం చేశారని తాటిపర్తి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 1955లో ఈ భూములను దానం చేసినప్పటి నుంచి కాస్తులో ఉన్న వీటిని భూదాన్ భూమిగా తేల్చడంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ భూములను పేదలకు పట్టాలివ్వాలని అప్పటి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే కొండిగారి రాములు, గీతారామస్వామి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అనంతరెడ్డి ఈ భూములపై సమగ్ర విచారణ చేసి భూదాన్‌భూమిగా తేల్చి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి పేదలకు న్యాయం చేశారన్నారు. ఈ విషయంలో మాకు న్యాయం చేయాలని భూదాన్‌భూమి సాగు చేసుకుంటున్న మేమంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కాగా తాటిపర్తి గ్రామంలో భూదాన్‌భూమి పట్టాభూమిగా తప్పుడు రికార్డులు నమోదు చేసి ఫార్మాసిటీ కోసం సేకరించడం దారుణమని గ్రామస్తులు చెప్పారు. పట్టాభూమిగా చూపి పరిహారం కాజేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. అధికారులను మచ్చిక చేసుకొని కొంతమంది నాయకులు పరిహారం పొందారని, దీనిపై కలెక్టర్ సమగ్రంగా విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు డబ్బు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టాభూమి కాదు భూదాన్‌భూమి అని తెలిసినా పరిహారం ఇచ్చిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీఎం రేవంత్‌ను కలుస్తాం



భూదాన్‌భూమిని పట్టాభూమిగా ప్రభుత్వానికి చూపి ఫార్మాసిటీ కోసం సేకరించిన అప్పటి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తాం. ఈ భూమి విషయమై కోదండరెడ్డితో కలిసి హెచ్‌ఆర్‌సీలో కూడా ఫిర్యాదు చేసిన అంశం సీఎంకు వివరిస్తాం. ఈ భూమిని పట్టాభూమిగా చూపి డబ్బు కాజేసిన నాయకులపై, వాటిని చెల్లించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎంను కోరతాం. ఆర్‌డీవో అనంతరెడ్డి మేలు మరువలేనిది.

డి.రమేష్, మాజీ సర్పంచ్ తాటిపర్తి

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్


మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్, పక్కన శ్రీవాణి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందని, పెండింగ్ కేసుల పరిష్కారానికి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణితో కలిసి మాట్లాడారు. సెప్టెంబరు 13న (రెండవ శనివారం) జిల్లాలోని అన్ని కోర్టులలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఇదివరకు కోర్టు ముందుకు రాని కేసులు కానీ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు కానీ పరిష్కరించుకునే వేదికే ఈ లోక్‌అదాలత్ అని తెలిపారు. లోక్‌అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసు లోక్‌అదాలత్‌కు పంపబడి ఆ తర్వాత పరిష్కరించబడినట్లయితే అప్పటికే కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా తిరిగి చెల్లించబడుతుందన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు, మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులు, చిట్‌ఫండ్, ఎలక్ట్రిసిటీ, చెక్కు బౌన్స్ కేసులతో పాటు ఇతర రాజీకి వీలున్న కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు.

ట్రిపుల్‌ఆర్ నిర్మాణంపై ఆందోళన వద్దు


● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

షాద్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రింగ్ రోడ్డు నిర్మాణం జరిగితే షాద్‌నగర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, దానిని అడ్డుకునే ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. ఈమేరకు బుధవారం చౌదరిగూడ మండలానికి చెందిన కొందరు రైతులు తమ గ్రామం మీదుగా ట్రిపుల్‌ఆర్ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు కోసం రైతులు కొంత భూమి ఇవ్వాల్సి వస్తుందని, దీనివల్ల వారి వారి ప్రాంతాల్లో ఉన్న భూముల ధరలు కూడా మరింత రెట్టింపయ్యే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం పరిహారం కూడా చెల్లిస్తున్నందున అభివృద్ధిని అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. రైతులు మాట్లాడుతూ రింగురోడ్డు వల్ల ఎకరం, రెండెకరాలు ఉన్నవారు కూడా భూమిని కోల్పోతే జీవనాధారం ఉండదని ఎమ్మెల్యేకు వివరించారు. వనంపల్లి మీదుగా రింగ్‌రోడ్డు నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు రాజు, బీసీసెల్ చైర్మన్ చంద్రశేఖర్‌తో పాటు దేవునిపల్లి సుధాకర్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉన్నారు.

మార్కింగ్‌ను మార్చాలి

వ్యవసాయ పొలాల మీదుగా నిర్మించతలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు మార్కింగ్‌ను మార్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం చించోడ్, అయ్యవారిపల్లి గ్రామ రైతులతో కలిసి ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్ నాగయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎస్.రాజు మాట్లాడుతూ ట్రిపుల్‌ఆర్ నిర్మాణం కోసం గతంలో సర్వేనెంబర్ 427లో సర్వే చేపట్టారని, ప్రస్తుతం అలైన్‌మెంట్‌ను మారుస్తూ సర్వేనెంబర్లు 486 నుంచి 499, 504 నుంచి 689కు మార్చారని తెలిపారు. తద్వారా ఆయా గ్రామాల సన్న, చిన్నకారు రైతులు 300 మంది వరకు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఈ సర్వే నెంబర్ల ప్రకారం నిర్మాణం చేపడితే చించోడ్, అయ్యవారిపల్లిలో ఎకరం భూమి కూడా మిగలదని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీను నాయక్, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రజావైద్యశాలను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారులు

ప్రజావైద్యశాలపై కొరడా

● సీజ్‌ను తొలగించి యథేచ్ఛగా ఆసుపత్రి నిర్వహణ
● మరోసారి సీజ్ చేసిన అధికారులు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతి లేని క్లీనిక్‌లపై అధికారులు కొరఢా ఝుళిపిస్తున్నారు. బుధవారం చేవెళ్ల మండలంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా బుధవారం చేవెళ్లలోని ప్రజావైద్యశాలను డిప్యూటీ డీఎంహెచ్‌వ నాగేంద్రబాబు, మొయినాబాద్ వైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణ సీజ్ చేశారు. అనంతరం అధికారులు వివరాలను వెల్లడించారు. మార్చి 29వ తేదీన చేవెళ్ల మండలం కేసారానికి చెందిన కళ్లెంల నర్సింహులు (53) ప్రజావైద్యశాలలో ఆపరేషన్ వికటించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు కె.శ్రీకాంత్ మే 29వ తేదీనా స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు విచారణ చేపట్టి అప్పట్లో ఆసుపత్రిని సీజ్ చేసినట్లు చెప్పారు. ఆసుపత్రి నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి యథేచ్ఛగా సీజ్ తొలగించి ప్రస్తుతం ప్రజావైద్యశాల కొనసాగిస్తున్నట్లు వైద్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిందన్నారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు బుధవారం తనిఖీ చేయడం జరిగిందని, ఆసుపత్రిని పరిశీలించగా సీజ్ తొలగించి ఉందని తెలిపారు. వెంటనే ఆసుపత్రిని తిరిగి సీజ్ చేయడం జరిగిందని, మరోసారి సీజ్‌ను తొలగిస్తే... క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరించారు.

బొంకూరువాగు నుంచి ఇసుక రవాణా

తాండూరు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంకూరు శివారులోని కాగ్నా నది నుంచి కొందరు రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. బొంకూరు యువకులు గమనించి బుధవారం ఇసుక ట్రాక్టర్లను ఆపారు. కాగ్నా నది నుంచి 10 నుంచి 12 ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అర్ధరాత్రి రుక్మాపూర్, మండాపూర్, రేగొండి తదితర ప్రాంతాల వారు ఇసుకను తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక ట్రాక్టర్లపై మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి వద్దకు వెళ్లి ఇసుక రవాణాను అరికట్టాలని కోరారు.

లైన్‌మెన్ వేతనాలు ఏఈల ఖాతాలోకి...

● క్లరికల్ ఎర్రర్‌తో వేతనాలు చెల్లింపుల్లో జాప్యం

తాండూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి నెల 1, 2వ తేదీల్లో విద్యుత్ సిబ్బందికి అందే వేతనాల్లో నియోజకవర్గ ఉద్యోగులకు జాప్యం అయింది. అకౌంటెంట్ క్లరికల్ ఎర్రర్ వల్ల వేతనాల్లో జాప్యం జరిగింది. సిబ్బంది, లైన్‌మెన్ వేతనాలు ఇంజినీరింగ్ అధికారుల ఖాతాల్లో పడ్డాయి. దీంతో 150 మంది ట్రాన్స్‌కో ఉద్యోగులకు వేతనాలందలేదు. తప్పును గ్రహించిన అకౌంట్స్ అధికారులు, బ్యాంకు సిబ్బంది ఈ నెల 12లోగా సరి చేస్తామని అధికారులకు హామీ ఇచ్చారు. ఇకపై పొరపాట్లు జరగకుండా చూస్తామని వివరణిచ్చారు.

బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని వార్డుల్లో బతుకమ్మ ఆడే స్థలాల్లో సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను 3వ వార్డు మాజీ కౌన్సిలర్ బొక్క సంగీతాప్రభాకర్‌రెడ్డి బుధవారం కోరారు. వారం రోజుల్లో బతుకమ్మ సంబరాలు మొదలవుతాయని, ఇప్పటి నుంచే శానిటేషన్ పనులు, లైటింగ్, భూమి చదును, బతుకమ్మ ఆడేచోట సౌండ్ సిస్టం ఏర్పాటు తదితర చర్యలు చేపట్టాని కోరారు. అలాగే ఎన్ఎఫ్‌సీనగర్, చందుపట్లగూడ, బొక్కోనిగూడ, వివిధ కాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని తెలిపారు. పిల్లలు, మహిళలను కురుస్తున్నాయని, కుక్కలను వేరే చోటకు తరలించాలని అధికారులను ఆమె కోరారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

అభివృద్ధిని అడ్డుకుంటున్న విపక్షాలు

ఆమనగల్లు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని అడ్డుకోవడమే విపక్షాలు పనిగా పెట్టుకున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో ప్రభుత్వంపై విష ప్రచారాలకు ఒడిగడుతున్నారని మండిపడ్డారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పనులు వేగవంతంగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో 20 నెలల్లో కల్వకుర్తి ప్రాంతం ఎంతో ప్రగతి సాధించిందని కసిరెడ్డి చెప్పారు. విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధిలో ప్రజలంతా ప్రభుత్వంతో కలిసి రావాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ మరోమారు ఘన విజయం సాధిస్తుందని కసిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, బీచ్యనాయక్, జగన్, మానయ్య, నాయకులు వెంకటేశ్వర్‌రావు, కాలె మల్లయ్య, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తాళ్ల రవీందర్, విజయ్‌రాథోడ్, సూదిని కొండల్ రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షీ టీం అవగాహన

దోమ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని బడెంపల్లి జెడ్పీ పాఠశాలలో బుధవారం పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జి నర్సిములు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ, పోక్సో యాక్ట్, డయల్ 100, 181, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటి పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన వంటి వాటిపై వివరించారు. హెచ్ఎం శివప్రసాద్, టీచర్లు, షీ టీం ప్రతినిధి సావిత్రి పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వ్యాసరచనతో వ్యక్తీకరణ, నైపుణ్యాల మెరుగు

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ, లేఖన నైపుణ్యాలు మెరుగవుతాయని కొడంగల్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీ సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో కళాశాల ఐక్యూఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ రచనకు బంగారు పతకాన్ని ప్రదానం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ టి.రాంబాబు, అధ్యాపకులు నర్సిములు, టి.రమేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూరులో కమిషనర్ మార్నింగ్ వాక్

తాండూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాండూరులో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ యాదగిరి అధికారులు, సిబ్బందితో మార్నింగ్ వాక్ నిర్వహించారు. బసవన్నకట్ట సమీపంలో ఉన్న పాత కూరగాయల మార్కెట్ సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికుల అటెండెన్స్‌ను పరిశీలించారు. అభివృద్ధి పనులపై మున్సిపల్ డీఈ, ఏఈలు, సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ నరేందర్‌రెడ్డి, డీఈఈ మణిపాల్, ఏఈ ఖాజా హుస్సేన్, హృదయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్‌కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

'అలైన్‌మెంట్'ను మార్చాలి : రైతులు



దీక్షలో భూ నిర్వాసితులు, నాయకులు

కడ్తాల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తరాలుగా సాగుచేసుకొని జీవనం పొందుతున్న పచ్చటి పంట పొలాల మీదుగా నిర్మిస్తున్న 765 హై టెన్షన్ విద్యుత్ టవర్ల నిర్మాణ పనులు నిలిపివేసి.. లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని రైతుల కోరారు. ఈమేరకు కడ్తాల మండల కేంద్రంలో భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం 3వ రోజుకు చేరాయి. వివిధ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. దీక్షలో మక్తమాదారం గ్రామానికి చెందిన భూనిర్వాసితులు నాగేశ్, శ్రీనివాస్, గణేశ్, శివకుమార్, పవన్‌యాదవ్‌లు కూర్చున్నారు. కడ్తాల రజక సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య దీక్షలను ప్రారంభించారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణలు శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. రాములు, పెంటారెడ్డి, రాజేందర్ యాదవ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

యాచారం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలనిచ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను అత్యధిక సంఖ్యలో దక్కించుకునేందుకు ప్రతీ కార్యకర్త శ్రమించాలని భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మండల నాయకులకు సూచించారు. బుధవారం బీజేపీ యాచారం మండలాధ్యక్షుడు విజయ్‌నాయక్, మాజీ అధ్యక్షుడు తాండ్ర రవీందర్ తదితరులు నగరంలో బూర నర్సయ్యగౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. యూరియా విషయంలో కొందరు నాయకులు కేంద్ర ప్రభుత్వంపై నిందలేయడం మంచిది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందన్నారు. నాయకులు గోగికార్ రమేష్, నాగటి యాదయ్య, జగదీష్‌యాదవ్, నర్సింహ, బీరప్ప తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత తప్పనిసరి



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో జయసుధ

దుద్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని డీపీవో జయసుధ సూచించారు. బుధవారం దుద్యాల మండలంలోని పోలెపల్లిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి ట్యాంకుల వద్ద బట్టలు ఉతకడం చేయరాదన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పోలెపల్లి, హకీంపేట్, ఈర్లపల్లి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈర్లపల్లి పంచాయతీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీవో సత్యనారాయన, వైద్యాధికారిణి వందన, జీహెచ్ఎం శంకర్, పంచాయతీ కార్యదర్శులు రాధిక, ఆనందం, సూర్య ప్రకాశ్, అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు న్యాయం



మాట్లాడుతున్న ఇబ్రహీం శేఖర్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనులకు న్యాయం జరుగుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్ అన్నారు. షాద్‌నగర్‌లోని సాయిరాజా ఫంక్షన్ హాలులో బుధవారం బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశానికి శేఖర్ హాజరై మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు బహుజనులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. బహుజనులకు అన్యాయం జరిగినప్పుడు ఆ మూడు పార్టీల ఎమ్మెల్యేలు మాట్లాడడం లేదని, వాటిని ఓడించి, బీఎస్పీని గెలిపించడానికి బహుజనులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అధికార దాహం కోసం కాంగ్రెస్ ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. బహుజనులందరూ బహుజన సమాజ్ పార్టీకి ఓటువేసి అధికారం పొందాలని శేఖర్ పిలుపునిచ్చారు. నాయకులు దాగిళ్ళ దయానంద్ రావు, బోయిని చంద్రశేఖర్‌ముదిరాజ్, దొడ్డి శ్రీనివాస్, గుండెల ధర్మేందర్, అనంత రాములు, గ్యార మల్లేష్, గడ్డం జనార్ధన్, గుండేటి నర్సింహులు, సొంటి శ్రీనివాస్, తుప్పరి కుమార్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

నెలలు దాటుతున్నా.. తప్పని పడిగాపులు



మంచాల : యూరియా బస్తా కోసం క్యూలో రైతులు

యాచారం/మంచాల/కేశంపేట/తాండూరు రూరల్/పరిగి/కులకచర్ల/కోట్‌పల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు గంటల తరబడి పడిగాపులు కాచినా.. ఒక్క బస్తా కూడా దొరకడం లేదని వాపోతున్నారు. యాచారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 150 మంది రైతులు బుధవారం ఉదయం 8గంటలకు యాచారం సొసైటీకి చేరుకున్నారు. యూరియా కావాలని, ఇంకెప్పుడు ఇస్తారని సొసైటీ అధికారులను ప్రశ్నించారు. రైతులు ఆందోళన చేస్తారని పసిగట్టిన వ్యవసాయాధికారులు రైతువేదికలోకి రప్పించారు. బస్తాల్లో ఉండే యూరియా కంటే నానోయూరియా వాడాలని వివరించే వీడియోను చూపిశాంతింపజేశారు. తీరా సాయంత్రం నాలుగు గంటలకు రైతులంతా వెళ్లిపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే యూరియా లోడ్ వస్తుందన్న సమాచారంతో బుధవారం తెల్లవారుజామునుంచే మంచాల పీఏసీఎస్ ఎదుట రైతులు పడిగాపులు కాశారు. ఉదయం 7గంటలకు 400 బస్తాలు వచ్చాయి. అన్నదాతలంతా ఒక్కసారిగా ఎగబడ్డారు. గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. క్యూలైన్లో నిల్చోబెట్టి ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. అలాగే కేశంపేట మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌కు 440 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పోలీసుల పర్యవేక్షణలో యూరియా బస్తాలు పంపిణీ చేశారు. అయితే పూర్తి చివర నిలిచి ఉన్న రైతులకు యూరియా అందకపోవడంతో నిరాశగా వెళ్లిపోయారు. మండలంలోని కొత్తపేట ప్యాక్స్‌కు నేడు(గురువారం) యూరియా వస్తుందని ఏవో శిరీష తెలిపారు.



తాండూరు రూరల్ : రైతులకు అరటిపండ్లు పంపిణీ చేస్తున్న శుభప్రద్‌పటేల్

యూరియా సరఫరాలో ప్రభుత్వాలు విఫలం

రైతులకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఎస్.శుభప్రద్ పటేల్ అన్నారు. బుధవారం ఎల్మకన్నె సొసైటీ రైతులు యూరియా కోసం బారులుతీరారు. శుభప్రద్ రైతుల వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆకలితో ఇబ్బంది పడుతున్న రైతులకు అరటిపండ్లు అందజేశారు. అనంతరం రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లాలోనే యూరియా కొరత ఏర్పడితే మిగతా జిల్లాల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ సీజన్‌లోనే బఫర్‌స్టాక్ పెట్టి ఎరువుల కొరత లేకుండా చూశారన్నారు. కాగా 450 బస్తాల యూరియాను ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున ఇన్‌చార్జి ఏడీ కొమరయ్య, సీఈవో శ్రీనివాస్, అడిషనల్ సీఈవో చంద్రారెడ్డి అందజేశారు. పరిగిలోని షాపుల వద్ద రైతులు గంటల తరబడి లైన్లో నిల్చున్నారు. చాలా మంది బస్తాకూడా దొరకలేదు. ఆగ్రోస్, లక్ష్మీ ఏజెన్సీ వద్ద ఒక్కో రైతుకు ఒక్క బస్తా ఇచ్చారు. గంటల వ్యవధిలోనే స్టాక్ అయిపోయింది. ఒక్కోబస్తానే ఇస్తున్నారని, ఇదీ నానో యూరియా తీసుకుంటేనే ఇస్తున్నారని రైతులు ఆరోపించారు. కులకచర్ల మన గ్రోమోర్ ఫర్టిలైజర్ షాపులో 300 బస్తాల యూరియా పోలీసు బందోబస్తు మధ్య ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. కోట్‌పల్లి మండలం బార్వాద్, మోత్కుపల్లి రైతు వేదికల వద్ద వద్ద రైతులు బారులు తీరారు. 200 బస్తాలు మాత్రమే రాగా అందుకు మూడింతల మంది రైతులొచ్చారు. కొందరికి యూరియా అందక ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవో కరుణాకర్‌రెడ్డి, ఏఈవో సందీప్, మరో రెండుమూడు రోజుల్లో వస్తుందని రైతులను సముదాయించి పంపారు.



కేశంపేట : మన గ్రోమోర్ సెంటర్ ఎదుట బారులు తీరిన రైతులు

బియ్యం పక్కదారి పట్టించిన ఇద్దరి అరెస్ట్

- రిమాండ్ విధించిన కోర్టు
- నిందితులను పోలీసు కస్టడీకి కోరిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



నిందితులు సంతోష్‌కుమార్, వెంకటేశ్

తాండూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కృష్ణసాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్లును లీజుకు తీసుకొని ప్రభుత్వం సరఫరా చేసిన వడ్లను, బియ్యాన్ని బ్లాక్‌లో అమ్మేసుకున్న సంతోష్‌కుమార్, వెంకటేశ్ అనే ఇద్దరిని బుధవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు వారికి రిమాండ్ విధించింది. అయితే వారిని పోలీసు కస్టడీకివ్వాలని కోరినట్టు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారంలో రవీందర్‌గౌడ్‌కు చెందిన రైస్ మిల్లును తాండూరుకు చెందిన అవిటి సంతోష్‌కుమార్ 2022లో లీజుకు తీసుకున్నాడన్నాడు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొన్న వడ్లను సంతోష్ మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా గోదాంలకు చేర్చకుండా అమ్మేసుకున్నాడన్నారు. 2022-23లో 142 క్వింటాళ్లు, 2023-24లో 17,265క్వింటాళ్ల వడ్లను పక్కదారి పట్టించారన్నారు. నిబంధనల మేరకు మిల్లు ఓనర్ రవీందర్‌గౌడ్‌కు సివిల్ సప్లయిస్ శాఖ రూ.6.39కోట్ల పెనాల్టీ విధిస్తూ నోటీసిచ్చిందని డీఎస్పీ తెలిపారు. లీజుకు తీసుకున్న సంతోష్‌కుమార్, అతడి పార్ట్‌నర్ వెంకటేశ్, సంతోష్‌కుమార్ భార్య శ్వేతలు బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లకు తరలించారని రవీందర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు పరిష్కారానికి సంతోష్‌కుమార్, వెంకటేశంలు రవీందర్‌గౌడ్‌కు రూ.5.1కోట్ల విలువైన మూడు చెక్కులివ్వగా అవి బౌన్స్ అయ్యాయని డీఎస్పీ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామని, మరింత విచారణకు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరినట్లు డీఎస్పీ వివరించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట్/పూడూరు/వికారాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న వికారాబాద్‌లోని జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మోమిన్‌పేట్ సీఐ వెంకట్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు వివాదాలు, మోటార్ వాహన ప్రమాదాల కేసులు, కుటుంబ వివాదాలు, క్రిమినల్ కేసులు, ఇతర రాజీపడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. పూడూరు మండలం చెన్‌గోముల్ ఎస్ఐ భరత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌తో రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. రాజీ మార్గమే రాజమార్గమని వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్ అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ఈ నెల 13న జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని తెలిపారు. పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షుడు దరువుల శంకర్, గౌరవాధ్యక్షుడు రాచాలపల్లి నర్సింహ, సమన్వయ కమిటీ అధ్యక్షుడు యూనుస్‌లు కోరారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం మహాసభల విజయవంతంపై సన్నాహక సమావేశం దరువుల శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పాల్గొన్నారు. మహాసభలకు సంబంధించి రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడబ్ల్యూజేఎఫ్ ముందుకు సాగుతుందని వారు తెలిపారు. రాష్ట్ర నాయకుడు మస్న ఆనంద్‌కుమార్, జిల్లా నాయకులు కోట్ల వెంకటేశ్, చప్పిడి తిరుపతి, తూర్పు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

చేవెళ్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు మాల చందు తెలిపారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని వివిధ కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీలు వేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కాలయాపన చేయడం, ప్రస్తుత ప్రభుత్వం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. అనంతరం వివిధ కళాశాలల్లో నూతన కమిటీలను నియమించి నియామకపత్రాలను అందించారు. నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

నియోజకవర్గానికి నాలుగు నీటిశుద్ధి కేంద్రాలు

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం/కందుకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గానికి నాలుగు నీటి శుద్ధి కేంద్రాలు మంజూరయ్యాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల, మీర్‌పేట్, సంద చెరువుల వద్ద నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు రూ.1,31,93 కోట్ల నిధులు విడుదలయ్యాయని తెలిపారు. నీటిశుద్ధి కేంద్రాల పనులను వీలైనంత త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న సబితాఇంద్రారెడ్డి

చాకలి ఐలమ్మకు ఎమ్మెల్యే నివాళి

తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శణీయమని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని తుక్కుగూడలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యు.శ్రీనివాస్, జెల్లల లక్ష్మయ్య, రవినాయక్, రాజు తదితరులు ఉన్నారు.

నేడు కందుకూరులో పర్యటన

కందుకూరు మండలంలోని సాయిరెడ్డి గూడ, ఉట్లపల్లి ముచ్చర్ల గ్రామాల్లో కార్యకర్తల సమావేశంలో పాల్గొనడానికి నేడు(గురువారం) ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి రానున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్ తెలిపారు. ఉదయం 10గంటలకు సాయిరెడ్డిగూడ, 11గంటలకు ముచ్చర్ల, 12గంటలకు ఉట్లపల్లి గ్రామాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

జీపీ కార్మికులకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి



మహాసభలో మాట్లాడుతున్న గ్యార పాండు

కడ్తాల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని గ్రామ పంచాతీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులకు ప్రతీనెల ఖాతాలలో డబ్బులు వేయాలని కోరారు. కడ్తాలమండల కేంద్రంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ పెంటయ్య అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్మికుల మండల మహాసభ నిర్వహించారు. సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో సుజాతకు సమస్యల పరిష్కారంపై వినతిపత్రం అందజేశారు.

నూతన కమిటీ ఏర్పాటు

సీఐటీయూ మండల కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆశీర్వాదం, కోశాధికారిగా కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా బీమమ్మ, అంజమ్మ, సహాయ కార్యదర్శులుగా కార్యనాయక్, బండి కృష్ణయ్య, సభ్యులుగా నర్సింహ, అంజమ్మ, రాములు, చెన్నయ్య, దశరథం, రవి, లక్ష్మయ్య, చిట్టెమ్మ, తదితరులున్నారు.

యూరియా కొరత తీర్చకపోవడం సిగ్గు చేటు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

మర్పల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం మర్పల్లిలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ రాష్ట్రస్థాయి జనతా గ్యారెజ్‌గా మారినట్లే మర్పల్లిలోని కార్యాలయం కూడా ప్రజాసమస్యలకు పరిష్కారానికి జనతా గ్యారెజ్‌లా పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై రాజకీయాలు మాట్లాడటం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మధుకర్, బీఆర్ఎస్ నాయకులు బట్టు రమేశ్, మోహన్‌రెడ్డి, గఫార్, శ్రీకాంత్, అశోక్, శ్రీనివాస్, రాజన్న, వెంకటేశ్, జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోషక మాసోత్సవాలలో ఎన్ఐఎన్ అసిస్టెంట్‌ప్రొఫెసర్ శిరీష

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎన్ఐఎన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష

కడ్తాల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పోషకాహారం సంపూర్ణ ఆరోగ్యానికి దోహద పడుతుందని జాతీయ పౌష్టికాహార పరిశోధన సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష అన్నారు. చిరుధాన్యాలు రోజువారి ఆహారంలో విధిగా తీసుకోవాలని ఆమె సూచించారు. కడ్తాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంఆ ఆమె మాట్లాడుతూ.. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. శారీరక శ్రమకోసం వ్యాయామం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయ, ఎన్ఐఎన్ బృందం సభ్యులు వంశీకృష్ణ, సప్తదీపగోష్, జాన్వి, కుజిత పోలకల, యంగ్ ఎర్త్‌లీడర్స్ ప్రోగ్రామ్ జిల్లా కో-ఆర్డినేటర్ రజనీకాంత్ పాల్గొన్నారు.

చైతన్యం రగిలించిన వీరవనిత ఐలమ్మ



పరిగిలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మహిళలు, నాయకులు

విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులు అర్పించిన నాయకులు

పరిగి/ఘట్‌కేసర్/కొడంగల్ రూరల్/కులకచర్ల/తాండూరు/చౌడాపూర్/మేడ్చల్ టౌన్/కీసర, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పరిగిలో ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి వేర్వేరుగా కోర్టు సమీపంలో ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రజల్లో సామాజిక చైతన్యం రగిల్చిన వీర వణిత చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే అన్నారు. వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి నివాళులు అర్పించారు. మాతృభూమి అభివృద్ధి సేవా సంస్థ చైర్మన్, బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ నివాళులర్పిచారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి భవిష్యత్తు తరాలకు ఆదర్శం అని సీఐటీయూ నాయకుడు చింతల యాదయ్య అన్నారు. పోచారం పరిధి ఆర్జీకే కాలనీలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సబిత, అరుణ, భారతి, పార్వతి, ప్రేమలత, మంజుల పాల్గొన్నారు. అన్యాయాన్ని నిలదీసిన సివంగి చాకలి ఐలమ్మ అని మాజీ సర్పంచ్ సయ్యద్ అంజద్ అన్నారు. కొడంగల్ మండలం పర్సాపూర్‌లో ఐలమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. వీరనారి ఐలమ్మ భూస్వాములు, పటేల్, పట్వారీలకు ఎదురొడ్డి పోరాడారని అన్నారు. మొగులయ్య, నాగప్ప టీచర్, రజక సంఘం అధ్యక్షులు కృష్ణ, అశోక్, భాగ్యలక్ష్మి, మల్లప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.కులకచర్లలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కృషి చేద్దామని నాయకులు అన్నారు. కార్యక్రమంలో మండల రజక సంఘం నాయకులు రాములు, లక్ష్మయ్య, వెంకటేశ్, కృష్ణయ్య, భీమయ్య, బాలయ్య, శ్రీనివాస్, రాజు, మహిళలు పాల్గొన్నారు. తాండూరులో ఐలమ్మ విగ్రహం వద్ద నాయకులు నివాళులు అర్పించారు. జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, జిల్లా బీసీ సంఘం నాయకులు గడ్డం వెంకటేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి బస్వరాజ్ నివాళులు అర్పించారు. ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చౌడాపూర్‌లో బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రాందాస్, ముబీన్, రాజశేఖర్, కృష్ణయ్య, నర్సిములు పాల్గొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఐలమ్మను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లో నాయకులు పట్టణంలోని గ్రంథాలయ చౌరస్తా వద్ద గల ఐలమ్మ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. నాయకులు సుదర్శన్‌రెడ్డి, పోచమ్మ, రాజుగౌడ్, వెంకటేశ్, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఐలమ్మ వర్ధంతిని కీసరలో నిర్వహించారు. రాజకీయ, కుల సంఘాల, యువజన సంఘాల నాయకులు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.



మేడ్చల్ టౌన్: చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కీసరలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసిన రజక సంఘం, రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు



కొడంగల్ రూరల్: పర్సాపూర్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు



తాండూరు పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బీసీ సంఘం నాయకులు

అదును దాటుతున్నా.. అందని యూరియా!

(ఐదో పేజీ తరువాయి)

పెరిగింది. అలాగే ప్రస్తుతం బోరుబావుల కింద రైతులు వరినాట్లు వేయడంలో బిజీగా ఉన్నారు.

20వేల మెట్రిక్ టన్నులు మాత్రమే

ప్రధానంగా పరిగి సబ్ డివిజన్ పరిధిలో జిల్లాలో యూరియా లభ్యత సరిపడా లేక రైతులు పొరుగున ఉన్న పాలమూరు, సంగారెడ్డి, రంగారెడ్డిలతో పాటు కర్ణాటకకు వెళ్తున్నారు. ప్రారంభం నుంచి కలిసిరాని కాలంతో పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. జిల్లాలో వివిధ రకాల పంటలు 5.6లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, వరి, కంది పంటలే ఎక్కువగా సాగు చేశారు. ఈ సీజన్‌కుగాను 38,344 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటి వరకు 20,000 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. అంటే ఇప్పటి వరకు యూరియా సగమే వచ్చిందని స్వయంగా డీలర్లే చెబుతున్నారు.

మరోవైపు పక్కదారి

జిల్లాలో యూరియా కొరతతో ఒకవైపు రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు పక్కదారి పడుతోంది. పంటలకు వినియోగించే యూరియాను అక్రమంగా రవాణా చేసి, ఇతర అవసరాలకు వాడుతున్నారనే ఆరోణలు ఉన్నాయి. తాజాగా మాదారం ప్లైవుడ్ కంపెనీకి వెళ్తున్న 600యూరియా బస్తాలున్న లారీని పట్టుకున్నారు. నీమ్ కోటెడ్ యూరియాను పంటలకు ఉపయోగిస్తారని, పట్టుబడిన యూరియాను ప్లైవుడ్ పాలిమరైజేషన్ కోసం వాడుతుంటుంటారని చెబుతున్నా పంటలకు వాడే యూరియానే అని అంటున్నారు. వాటికి సంబంధించిన పత్రాలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనికితోడు ఏళ్లుగా బ్లాక్‌కు తరలిస్తున్నారు. అధికారులకు తెలిసే జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

ఏదైనా కొంటేనే యూరియా బస్తా

యూరియా కొరత వల్ల ఇతర ఏదైనా మందులు కొంటేనే యూరియా బస్తాలు ఇస్తున్నారు. ఒక యూరియా బస్తా కావాలంటే, రసాయన మందులైన పొటాష్, పోరేట్, నానో మందులు కొంటేనే ఇస్తున్నారు. ఎందకిలా అని ప్రశ్నిస్తే అది అంతే అని డీలర్లు చెబుతున్నారు. 50 కేజీల యూరియా బస్తా రూ.266కే విక్రయించాలి. కానీ, రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి, యూరియా కొరత తీర్చి,ఎమ్మార్పీకే విక్రయించాలని కోరుతున్నారు.

యూరియా కొరత లేదు



యూరియా దొరకడం లేదని వచ్చే పుకార్లు రైతులు నమ్మొద్దు. అన్ని షాపుల్లో నిల్వలున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందును ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంది. యూరియా లేదని చెప్పే దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. మాదారం వద్ద పట్టుబడిన యూరియా శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించాం. అది పంటలకు వాడే యూరియా అని తెలితే చర్యలు తీసుకుంటాం. నానో యూరియాను వాడితే మంచి లాభాలు ఉంటాయి.

- రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి

పండుగల ఏర్పాట్లతో ట్రాఫిక్ ఇక్కట్లు

- పోలీసులు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో ఏర్పాటు చేసిన లైటింగ్ కమాన్‌లు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ఊరేగింపు పేరుతో చేపట్టిన కార్యక్రమాలతో ఘట్‌కేసర్‌లో టాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. అయినా పట్టించుకునే నాథుడు లేడు. రెండు రోజుల కింద నిమజ్జనాలకు భారీ ఏర్పాట్లు చేశారు. ఎదులాబాద్ రోడ్డులో రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెట్టారు. అసలే ఘట్‌కేసర్‌లో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తుండడంతో రాకపోకలను ఎదులాబాద్ రోడ్డు గుండా సాగిస్తున్నారు. ఈ రోడ్డులోనే నిమజ్జనాల కోసం ఏర్పాట్లతో గంటల తరబడి రాకపోకలను నిలిపివేయడంతో వాహనదారులు సందులగుండా రాకపోకలు సాగించి ఇబ్బందులు పడ్డారు. త్వరలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సైతం రోడ్లపై కమాన్‌లు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తారు. రవాణ వ్యవస్థలకు అంతరాయం కలిగిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాకపోకలకు ఇబ్బందులు కలిగించే పనులు చేపట్టకుండ చర్యలు తీసుకోవాలంటున్నారు.



ఘట్‌కేసర్‌లో బారికేడ్లు పెట్టి రాకపోకల నిలిపివేత ఇలా..

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



తాండూరు ఉత్తమ ఉపాధ్యాకులను సన్మానించిన పీఆర్టీయూ-టీఎస్ మండల నాయకులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను పీఆర్టీయూటీఎస్ తరపున బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మార్సీ సిబ్బందినీ సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్యగౌడ్, నాయకులు నాగప్ప, కిష్టప్ప, నర్సిరెడ్డి, జైపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

దుద్యాల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని 13 మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని దుద్యాలలోని జెడ్పీ పాఠశాలలో ఎంఈవో విజయరామారావు టీచర్లు సన్మానించారు. హకీంపేట్ జీహెచ్ఎం శంకర్, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, మల్లప్ప, శంకరయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

దోమ: దోమలోని రైతు వేదికలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సన్మానించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకొని విద్యార్థులకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.



దుద్యాలలో ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈవో, నాయకులు



టీచర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆమే 'కీ'లకం!

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రాల జాబితా ఖరారు చేయడానికి ముందు సోమవారం జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశాలు నిర్వహించి సూచనలు తీసుకుని తుదిజాబితా ప్రకటించారు.

227 ఎంపీటీసీ స్థానాలు...

జిల్లాలో 20జెడ్పీటీసీ, 227 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మండలానికి ఒక జెడ్పీటీసీ స్థానం ఉండగా, ఒక్కో మండలంలో ఓటర్ల సంఖ్య ఆధారంగా 6 నుంచి 15 వరకు ఎంపీటీసీ స్థానాలున్నాయి. బంట్వారం మండలంలో 6, బషీరాబాద్‌లో 12, బొంరాస్‌పేట్‌లో 11, ధారూరులో 12, దోమలో 14, దౌల్తాబాద్‌లో 14, కొడంగల్‌లో 11, కోట్‌పల్లిలో 7, కులకచర్లలో 12, మర్పల్లిలో 15, మోమిన్‌పేట్‌లో 12, నవాబ్‌పేట్‌లో 12, పరిగిలో 11, పెద్దేముల్‌లో 13, పూడూరులో 13, తాండూరులో 15, వికారాబాద్‌లో 7, యాలాల్‌లో 13, చౌడాపూర్‌లో 9, దుద్యాల్‌లో 8 చొప్పున ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలు

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం మొత్తం 1,289 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. బంట్వారం మండలంలో 30 పోలింగ్ కేంద్రాలు, బషీరాబాద్‌లో 82, బొంరాస్‌పేట్‌లో 60, ధారూరులో 69, దోమలో 75, దౌల్తాబాద్‌లో 71, కొడంగల్‌లో 53, కోట్‌పల్లిలో 43, కులకచర్లలో 63, మర్పల్లిలో 94, మోమిన్‌పేట్‌లో 76, నవాబ్‌పేట్‌లో 69, పరిగిలో 56, పెద్దేముల్‌లో 77, పూడూరులో 80, తాండూరులో 79, వికారాబాద్ 47, యాలాల్ 80, చౌడాపూర్ 43, దుద్యాల్‌లో 42 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

అభ్యంతరాల పరిష్కారం

డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై దౌల్తాబాద్‌లో 7, తాండూరులో 4 అభ్యంతరాలొచ్చాయి. రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నారు. తాండూరులో గుండ్లమడుగు పంచాయతీ పరిధి మైసమ్మ తండాలో ఉన్న 333మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు మూడు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి రావడం వల్ల అక్కడే కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కరన్‌కోట్ ఎంపీటీసీ-1 పరిధిలో 38 నుంచి 42వరకు పోలింగ్ కేంద్రాలను ప్రాథమిక పాఠశాల(బాలుర) నుంచి అదే ఆవరణలోని జెడ్పీ పాఠశాలకు మార్చారు. కరన్‌కోట్ ఎంపీటీసీ-2 పరిధిలో 43 నుంచి 46 వరకు పోలింగ్ కేంద్రాలను 6 నుంచి 9 నంబరు గదుల నుంచి 1, 2, 3, 6 నంబర్ గదులకు మార్చారు. కరన్‌కోట్ ఎంపీటీసీ-3 పరిధిలో 47 నుంచి 49 పోలింగ్ కేంద్రాలను అదే ప్రాంగణంలో 10, 11, 12 గదుల నుంచి 7, 8, 9 నంబర్ గదులకు మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. దౌల్తాబాద్ మండలంలో అంత్వార్, చంద్రకల్, ఈర్లపల్లి, సూరాయిపల్లి, పంద్యానాయక్ తండా, గోకఫసల్వాద్, నందారం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఓ భవనం నుంచి అక్కడే మరో భవనంలోకి మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు.

మండలాల వారీగా ఓటర్లు

బషీరాబాద్ మండలంలో 40,990 మంది ఓటర్లు, బొంరాస్‌పేట్‌లో 32,121, దౌల్తాబాద్‌లో 40,977, కొడంగల్‌లో 32,205, పెద్దేముల్‌లో 40,828, తాండూరులో 46,646, యాలాల్‌లో 38,710, బంట్వారంలో 17,589 మంది ఓటర్లు ఉన్నారు. ధారూరులో 36,261, దోమలో 44,185, కోట్‌పల్లిలో 21,427, కులకచర్లలో 38,387, మర్పల్లిలో 45,581, మోమిన్‌పేట్‌లో 39,576, నవాబ్‌పేట్‌లో 37,786, పరిగిలో 31,139, పూడూరులో 43,593, వికారాబాద్‌లో 24,237, చౌడాపూర్‌లో 25,156, దుద్యాల్‌లో 21,078 మంది ఓటర్లు ఉన్నారు.

సంక్షిప్తంగా..

- **బొంరాస్‌పేట్:** రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యాఖ్యానించిన ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, సోయం బాబురావులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బుధవారం బొంరాస్‌పేట్‌లో గిరిజన సంఘం నాయకులు నిరసన తెలిపారు. భూలక్ష్మమ్మ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు నాయక్, రవి, నర్సింగ్, మోహన్, సీతారాం, నర్సింగ్ పాల్గొన్నారు.
- **కొడంగల్:**నాగారానికి చెందిన రైతు పకీరప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అన్నారం తపాల కార్యాలయంలో రూ.555 చెల్లించి బీమా చేశాడు. పకీరప్పకు వచ్చిన లక్ష చెక్కును బీమా అతడి కుమారుడు అనిల్‌కుమార్‌కు అధికారులు అందించారు. కార్యక్రమంలో సజ్జన్‌కుమార్, నరేశ్, కృష్ణ, రమేశ్, రాములు పాల్గొన్నారు.
- **పరిగి:** పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పేటమాదారం బీఆర్ఎస్ నాయకులు కె.వినాయకరెడ్డి, రాజేందర్‌రెడ్డి, కృష్ణయ్య, బిచ్చన్న,బస్వలింగం, సంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, కృష్ణారెడ్డి, రాములు, తిరుమలయ్య, జి.వేణుగోపాల్, నర్సోజి, రమేశ్, బాలయ్య, 50మంది బీఆర్ఎస్‌లో చేరారు.
- **బొంరాస్‌పేట్:** లింగన్‌పల్లి పాఠశాల విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ ఎల్ఎల్‌బీ విద్యార్థి నరసింహాగౌడ్ ప్లేట్‌లు, గ్యాస్ పంపిణీ చేశారు. ఎంఈవో హరిలాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. హెచ్ఎం రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.
- **కులకచర్ల:** కాంగ్రెస్‌లో యువతకు ప్రాధాన్యం ఇస్తున్నామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. పుట్టపహడ్‌లో కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుర్మయ్య, ఉపాధ్యక్షుడిగా సర్వర్, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వర్‌గౌడ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం



వికారాబాద్: జిల్లాలో పర్యటించిన తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు భారతి, శారద, ఆనంద్‌లకు అధికారులు స్వాగతం పలికారు. గెస్ట్‌హౌస్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కలిసి మాట్లాడారు. డీఆర్వో శ్రీనివాస్, ఆర్డీవో వాసుచంద్ర, డీఎస్వో సుదర్శన్, డీఈఓ రేణుకాదేవి వారికి స్వాగతం పలికారు.

క్రైం కార్నర్

రైల్వే బ్రిడ్జిపైనుంచి పడి కూలీ దుర్మరణం



సురేష్ మృతదేహం

తాండూరు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓ అడ్డా కూలీ బ్రిడ్జిపై నుంచి పడి మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం కొండాపూర్‌కు చెందిన దొడ్ల సురేష్(30) కొన్నేళ్లుగా రైల్వే కాంట్రాక్టర్ వద్ద కూలిగా పనిచేస్తున్నాడు. పెయింటింగ్ కూడా వేసేవాడు. నారాయణపూర్ రైల్వే బ్రిడ్జి పక్కన ఇనుప నిచ్చెనకు మరమ్మతులు చేపట్టారు. సురేష్, మరో కూలీ అజీ మరమ్మతులు చేస్తుండగా నిచ్చెన కింద పడింది. వాగులో బ్రిడ్జి కింద ఉన్న పిల్లర్ల పక్కన రాళ్లలో సురేష్ తల ఇరుక్కుంది. దీంతో ఊపిరాడక మృతిచెందాడు. అంజీ వాగులో పడటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు సురేష్ మృతదేహాన్ని వెలికి తీసి తాండూరు ఆస్పత్రికి తరలించారు. సురేష్ తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బషీరాబాద్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి):అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ నుమాన్‌అలీ బుధవారం తెలిపారు. కాశీంపూర్ వద్ద తాండూరు వైపు నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్లను అర్ధరాత్రి 1:30గంటల సమయంలో పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేవని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లు నరేష్, పరశురాంలను విచారించగా వీరిశెట్టిపల్లి కాగ్నా నుంచి ఇసుక తరలిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల బాలికపై లైంగిక వేధింపుల కేసులో మేడ్చల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు నిచ్చింది. పీపీ విజయ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో అల్వాల్ పీఎస్ పరిధిలో చిన్నారిపై లైగిక వేధింపులకు పాల్పడిన విజయ్‌కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పూర్వపరాలు పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జి అమరావతి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. అలాగే చిన్నారికి రూ.20వేల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

కానిస్టేబుల్‌పై దాడి ఘటనపై అధికారుల ఆరా

తాండూరు రూరల్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): చంద్రవంచలో ఇరు వర్గాల ఘర్షణను అదుపు చేసే క్రమంలో కానిస్టేబుల్ గాయపడిన ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీశారని కరన్‌కోట్ ఎస్సై రాథోడ్ వినోద్ బుధవారం తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన గొడవతో అర్ధరాత్రి కర్రలతో దాడిచేసుకున్నారన్నారు. గ్రామానికి వెళ్లిన కానిస్టేబుల్ బస్వరాజ్‌పై సైతం దాడి చేయడంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారని తెలిపారు. ఓ వర్గంలో 27 మందిని, మరో వర్గం నుంచి 18 మందిని స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నట్టు చెప్పారు. కానిస్టేబుల్‌పై దాడి చేసినవారిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేస్తామని ఎస్సై చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కులకచర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు. బుధవారం అంతారంలో రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా నంచర్ల నుంచి వస్తున్న వాహనంలో ఐదు క్వింటాళ్ల బియ్యం లభించాయి. గండీడ్ మండలం కొంరెడుపల్లికి చెందిన బాలకృష్ణ ప్రజల దగ్గరి నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని కులకచర్లకు తీసుకువస్తున్నట్లు ఎస్సై రమేశ్ కుమార్ తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాన్ షాపుల్లో గుట్కా ప్యాకెట్ల పట్టివేత

కులకచర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కులకచర్లలో పోలీసుల తనిఖీల్లో గుట్కాలు పట్టుబడ్డాయి. ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో పోలీసులు దాడులు నిర్వహించగా మూడు పాన్‌షాపుల్లో గుట్కాలు లభించాయి. ఫయాజ్, ఆరీఫ్, మహేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్‌కుమార్ తెలిపారు.

వర్షానికి తడిసిన మినప పంట

కొడంగల్ రూరల్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): పంట చేతికి వస్తుందని ఆశించిన రైతు ఆశలు బుధవారం కురిసిన వర్షానికి అడియాశలయ్యాయి. టేకులకోడ్‌లో రైతు కుర్వ నరేష్ సాగుచేసిన మినప పంట చేతికి రావడంతో కూలీలతో కోయించి రోడ్డుపై ఆరబోశాడు. ఒక్కసారిగా వర్షం కురవడంతో పంట తడిసిపోయింది. తనకు తీవ్ర నష్టం జరిగిందని రైతు వాపోయాడు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

యాలాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో గంగసాగర్, అన్నసాగర్ గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు యాదయ్య, బాబయ్య, సుకుమార్, నర్సింహులు, సుధాకర్, రాజు, దేవదాసు, శ్రీనివాస్, యాదయ్య, అనంతయ్య కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రప్ప, శ్రీనివాస్, మల్లేశం, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులున్నారు.

మాదిగలకు ఇళ్లు మంజూరు చేయాలి

ధారూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేరెల్లిలో మాదిగలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అన్యాయం జరిగిందని, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని బుధవారం జిల్లా కలెక్టర్‌కు పి.రాజు వినతిపత్రం ఇచ్చారు. అనర్హులకు, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికే ఇళ్లు మంజూరు చేశారని, విచారణ చేయించాలని కోరారు. మాదిగలకు రెండు ఇళ్లు మాత్రమే మంజూరు చేశారని ఆయన ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎస్‌హెచ్‌జీల నుంచి వసూళ్లను నిలిపివేయాలి

మేడ్చల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ జిల్లాలో ఎలాంటి ప్రభుత్వ ఆదేశాలు లేకుండా పలు మున్సిపాల్టీల్లో ఎస్‌హెచ్‌జీలలో ఆడిట్ పేరుతో ఒక్కో గ్రూపు నుంచి రూ.2 నుంచి 3వేల వరకు వసూలు చేస్తున్నారని, దీనిని వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా పీడీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆడిట్ రిపోర్టు ఇవ్వకుండా, తీసుకున్న డబ్బులకు రశీదు ఇవ్వకుండా ఎస్‌హెచ్‌జీల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ నిధి పేరుతో సోషల్ ఆడిట్ జరిగినప్పుడు గ్రూపుల్లో ఉన్న వీఏ లేదా ఎస్‌హెచ్‌జీలలో ఎవరైనా డబ్బులు కట్టకుంటే దానికి ఆర్పీలను బాధ్యులను చేసి జీతాల నుంచి డబ్బు కట్ చేయడం దుర్మార్గ చర్య అన్నారు. ఈ పద్ధతిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి, కార్యదర్శి నంద, ఇందిర, జ్యోతి, లక్ష్మి, కవిత, కృష్ణవేణి, అనిత, సుజాత, లత, మంజుల పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



లక్ష్మయ్య(ఫైల్)

మర్పల్లి, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతిచెందాడు. మల్లికార్జుననగిరి మాజీ సర్పంచ్ లక్ష్మయ్య(60) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మిర్జాపూర్‌లో జన సురక్ష రీ-కేవైసీ శిబిరం

పూడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మిర్జాపూర్‌లో బుధవారం ఎస్బీఐ బ్రాంచ్ ద్వారా జనసురక్ష రీ-కేవైసీ శిబిరాన్ని నిర్వహించారు. సికిందరాబాద్ మాడ్యూల్ డీజీఎం కుమార్ రోహిత్, ఆర్ఎం నితిన్‌కుమార్ హాజరయ్యారు.